## క్లుప్తంగా

### ఈరలింగప్ప స్వామికి ప్రత్యేక పూజలు

**అమరాపురం:** బంగారు పాళ్యం సమీపంలో వెలసిన శ్రీ ఈరలింగప్ప స్వామికి భక్తులు శుక్రవారం తలనీలాలు సమర్పించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నల్లకంబడి పరచి అందులో కలశాలను ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ తలనీలాలను దేవునికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే వంట వార్పు చేసి వచ్చిన భక్తులు, బంధువులకు అన్నదానం చేశారు. దేవగానపల్లి, నగోనపల్లి, గౌడనకుంట, అమరాపురం, బంగారు పాళ్యం తమ్మడేపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

### కెంచమాంబదేవి ఉత్సవాలు

**అమరాపురం:** మండలంలోని గౌడనకుంట, ఉదుగూరు గ్రామాల్లో సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన వక్కలిగుల దేవత కెంచమాంబదేవి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెంచమాంబదేవికి అర్చకులు ఉదయం నుంచి సాయంకాలం వివిధ రకాల పూజలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆయా గ్రామాల్లో ఊరేగించారు. అలాగే వీరలింగేశ్వరస్వామి, బెనవన్న స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### విజేతలకు ట్రోఫీ అందజేత

**పావగడ:** తాలూకా లోని కిలార్లహళ్లిలో నిర్వహించిన మూడు రోజుల కిలార్లహళ్లి ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల విజేతలకు స్థానిక విధాన సభ కాంగ్రెస్ అభ్యర్థి హెచ్ వి వెంకటేష్ బహుమతులు అందించారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో మెరుగైన ఆట ను ప్రదర్శించి విజేత గా నిలిచిన ట్రోఫీ ఫైటర్స్ జట్టుకు ప్రథమ బహుమానంగా ట్రోఫీ అందించారు. రన్నర్స్ స్థానాన్ని దక్కించుకున్న బ్రేవ్ హార్ట్ వారియర్స్ జట్టుకు ద్వితీయ బహుమానం అందించారు. పోటీల్లో పాల్గొన్న ఇతర జట్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు శివమూర్తి, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నరసింహప్ప, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

### వర్మీకంపోస్టు తయారీపై శిక్షణ

**గోరంట్ల:** పట్టణంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, తదితర అంశాలపై పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పంచాయతీల క్లాప్‌మిత్రలు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గోరంట్ల గ్రామ పంచాయతీ క్లాప్‌మిత్రలు, మల్లాపల్లి ,బుక్కపట్నం మండలంలోని అగ్రహారం, స్దిరాంపురం, కొత్తచెరువు మండలంలోని బైరాపురం, నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ క్లాప్‌మిత్రలు, సర్పంచులు, సచివాలయ ఇంజినీర్లు, సహాయకులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల శిక్షణను ప్రారంభించారు. గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు, ఎంపీడీఓలు, రఘునాథగుప్త, శ్రీనివాసులు, సర్పంచులు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన

**లేపాక్షి:** మండలంలోని లక్కెపల్లి గ్రామ చెరువులో చేపట్టిన అజాదికా అమృత్ సరోవర్ పనులను డ్వామా ఏపీడీ శివానందనాయక్‌తో పాటు ఎంపీడీఓ నరసింహనాయుడు శుక్రవారం పరిశీలించారు. 2022 జూలై నెలలో అమృత్ సరోవర్ పనులు చేపట్టడడానికి రూ. 27 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2023 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పనులు జరుగుతున్నాయని వారికి వివరించారు. రూ.7.10 లక్షల నిధులు ఖర్చయిందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జ్యోతి, ఉపాధి ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### బాలికలను సంరక్షించడం అందరి బాధ్యత

**హిందూపురం:** బాలికా సంరక్షణ, విద్యాభివృద్ధికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు, ఆర్థిక భరోసా అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని బుక్కపట్నం డైట్ కళాశాల అధ్యాపకుడు ప్రకాష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగమణి అధ్వర్యంలో నాలుగురోజులు ర్యాలీలు, వక్తృత్వ పోటీలు నాటికలు, ఆటపాటలు, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం బాలికా సంరక్షణ, బాల్యవివాహాల నిషేధ పోస్టర్లు విడుదల చేశారు. ముగింపు సందర్భంగా అధ్యాపకులు ప్రసంగిస్తూ బాలికలను సంరక్షించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం వివిధపోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు.

# కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

- చిత్తూరు జిల్లా ఏఎస్పీ తిప్పేస్వామి
- ఘనంగా ఏపీఆర్ఎస్ 2023 మహోత్సవ్

**పరిగి:** విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని చిత్తూరు జిల్లా ఏఎస్పీ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల ప్రతిభావంతుల ఆశ్రమ పాఠశాల (ఏపీఆర్ఎస్ఓఈ) మహోత్సవ్ 2023ను ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజ, దీపోత్సవం, పాఠశాల వార్షికోత్సవం, ఫేర్‌వెల్‌డే తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ తిప్పేస్వామి, ఎంఈఓ లక్ష్మీదేవి హాజరయ్యారు. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన దీపోత్సవ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులందరినీ ఏఎస్పీతో పాటు అతిథులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. అనంతరం పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు.

**ఏపీఆర్ఎస్‌లో చదవడం అదృష్టం :**

కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌కు ఘన చరిత్ర ఉందని చిత్తూరు జిల్లా ఏఎస్పీ తిప్పేస్వామి తెలిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతో మంది కంపెనీ సీఈఓలు, డైరెక్టర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, సైంటిస్టులు, కమిషనర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు ఇలా ఎన్నో రంగాల్లో స్థిరపడ్డారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు, పర్యావరణవేత్త, భాస్కర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఏఎస్పీ తిప్పేస్వామి, ప్రిన్సిపాల్, ఎంఈఓ తదితరులు


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


దేశనాయకుల వేషధారణలో విద్యార్థులు

## 'హంద్రీ-నీవా' కు రూ.65 కోట్లు మంజూరు చేయాలి

- పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

**మడకశిర:** నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా పనుల పూర్తికి రూ.65 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం జీరో అవర్‌లో అసెంబ్లీలో మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, ఈనేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా పనులను పూర్తి చేయాలని కోరారు. ఈపనులను పూర్తి చేయడానికి రూ. 65 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈపనులను పూర్తి చేస్తే నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 214.85 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. ఈబైపాస్ కెనాల్ పనులను వెంటనే ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మడకశిర నియోజకవర్గంలో నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని, ఈనేపథ్యంలో మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సమాధానం ఇస్తూ మడకశిర నియోజకవర్గంలో హంద్రీనీవా పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


డాక్టర్ తిప్పేస్వామి

## ఉన్నత లక్ష్యాలతో ఉత్తములుగా ఎదగాలి

**హిందూపురం:** యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, లక్ష్యాలు నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో విజయం సాధించాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత సమాజాభివృద్ధికి సహకరించాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకుని, ఇతరుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, నవేరా, వార్డెన్ భారతి, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే శైలజ

## క్షయ వ్యాధిపై అవగాహన

**సోమందేపల్లి:** మండల కేంద్రంలో క్షయ వ్యాధిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. వైద్యుడు హరి మాట్లాడుతూ దగ్గు, జ్వరం, బరువు తగ్గుతుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మనోహర్ రెడ్డి, పీహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**మడకశిర:** క్షయను పారదోలుదామని వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ఆస్పత్రి నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్షయ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ బాధితులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్య సేవలందిస్తుందని వారు తెలిపారు. నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం క్షయవ్యాధిగ్రస్తులకు 6 నెలల పాటు అందిస్తుందని వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ మాధుర్య, డెంటల్ డాక్టర్ సురేఖదేవి, సూపర్‌వైజర్ సాయికృష్ణ, టీబీ యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**అమరాపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ నిర్మూలనపై వైద్యాధికారి మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పూర్తిగా క్షయను రూపు మాపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య ఆశా కార్యకర్తలు ఉన్నారు.


ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

## నమో: చౌడేశ్వరీమాత

**హిందూపురం:** మండలంలోని కొటిపి గ్రామంలో గ్రామదేవత చౌడేశ్వరి దేవి అమ్మవారి రథోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్ చౌడేశ్వరిదేవికి తెల్లవారుజామున నుంచి పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా పట్టు, పుష్పాలంకరణలు చేసి ఆకుల తోరణాలతో అర్చనలు, పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు చేసి కలశార్చనలు నిర్వహించి, ఊరేగింపు అనంతరం రథంలో కొలువుదీర్చారు. హిందూపురం చుట్టుపక్కల గ్రామాలే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. అలాగే అమ్మవారికు వడిబియ్యం అందించి మొక్కులు తీర్చుకున్నారు.


అశేషజనం మధ్య సాగుతున్న చౌడేశ్వరిదేవి రథోత్సవం

**గుడిబండ:** మోరుబాగల్ గ్రామంలో వెలసిన కరియమ్మ దేవత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు ఉపవాస దీక్షతో జ్యోతులను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా తీర్మానంపై హర్షం

**హిందూపురం టౌన్:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక పాస్టర్ ఫెలోషిప్స్ అధ్యక్షుడు డేవిడ్, ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ కాంపౌండ్ చర్చ్, పలు చర్చ్ పాస్టర్లు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. 26 సంవత్సరాలుగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తించి శాసనసభలో సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంపై యావత్ క్రైస్తవులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, ప్రభుత్వానికి క్రైస్తవులందరూ రుణపడి ఉంటామన్నారు.

### హాస్య నటుడి సోదరుడు మృతి

**పావగడ:** ప్రముఖ కన్నడ చిత్ర హాస్య నటుడు రంగాయణ రఘు సోదరుడు, స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత కొత్తూరు గ్రామం కేఆర్ దొడ్డేగౌడ శుక్రవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో హాస్య నటుడు రంగాయణ రఘు సోదరుడి భౌతిక కాయంపై పుష్ప గుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఇతనితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకుడు హెచ్ వి వెంకటేశ్ సైతం దొడ్డేగౌడ భౌతిక కాయానికి నివాళులర్పించాడు. ఇదిలా ఉండగా అప్పు నటించిన రాజకుమార, యువరత్న తదితర చిత్రాల్లో రంగాయణ రఘు హాస్య పాత్ర లో నటించి మంచి గుర్తింపు పొందాడు.

### దుర్గాదేవికి పూజలు

**లేపాక్షి:** స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి అమ్మవారిని శుక్రవారం ఉదయం అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకార్చనలు, తీర్థ ప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో పర్యాటకుల సందడి చోటు చేసుకుంది.

### పంచమ జ్యోతుల మహోత్సవం

**సోమందేపల్లి:** మండల కేంద్రంలోని చౌడేశ్వరి అమ్మవారి పంచమ జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున పంచమ జ్యోతులను ప్రదర్శన చేపట్టారు. ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్, ఉప సర్పంచ్ వేణు, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షలకు 19 మంది గైర్హాజరు

**మడకశిర:** నియోజకవర్గంలో 6 కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్ పరీక్షలు జరిగాయి. మొత్తం 1,245 విద్యార్థులకు గాను 1,226 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మడకశిర జూనియర్ కళాశాలలో 382 మందికి గాను 373 మంది, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 258 మందికి గాను 257 మంది, వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 191 మంది విద్యార్థులు గాను 186 మంది హాజరయ్యారు. అగళిలో 76 మందికి గాను 76 మంది, అమరాపురంలో 190 మందికి గాను 187 మంది, గుడిబండలో 148 మందికి గాను 147 మంది హాజరయ్యారు. ఇదిలా ఉండగా అగళి పరీక్ష కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ జిలాని తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు హాజీపీరాకూడా కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు అగళి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధారి తెలిపారు.

## చెత్త సంపద తయారీ కేంద్రాలపై శిక్షణ

**చిలమత్తూరు:** మండలంలోని కోడూరు మగ్రోతోపులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం డివిజన్ స్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు తొలిరోజు డివిజన్ పరిధిలోని అగళి, అమరాపురం మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఎస్‌డబ్ల్యూపీసీలపై అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా ఎస్‌డబ్లూపీసీ కేంద్రాల నిర్వహణ, ఎంపికైన గ్రామాల్లో చెత్త సేకరించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌పీఓ బాలాజీ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణ ద్వారా జీవన ఎరువుల తయారీ అవుతాయని, రైతులకు అతి తక్కువ ధరకు లభిస్తాయన్నారు. అంతేకాకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, ఈఓఆర్డీ సుభాషిణమ్మ, కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ మురళీమోహన్, ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

### తక్షణ సాయం అందజేత

**పెనుకొండ రూరల్:** మండలంలోని మునిమడుగుకు చెందిన బాబయ్య (38) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ.10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని వైస్ ఎంపీపీ చంద్రకళ, సర్పంచు అశ్వత్థనారాయణ, సచివాలయ సిబ్బంది శుక్రవారం అందించారు.

### సంక్షేమ పథకాలు వర్తింపజేయండి

**పెనుకొండ రూరల్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వర్తింపజేయాలని సబ్ కలెక్టర్ కార్తీక్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పెనుకొండ మండలంలోని గోనిపేట పంచాయతీ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. పథకాల స్టిక్కర్లను సచివాలయం ముందు భాగంలో అతికించాలన్నారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు. అనంతరం సచివాలయం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి విగ్రహం అనుమతులపై ఆరా తీశారు.

### విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**పెనుకొండ:** విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత హెచ్చరించారు. శుక్రవారం పెనుకొండలో సూపర్‌వైజర్ సుజాత అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసింది.

### అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

**హిందూపురం:** హిందూపురం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వరరావును నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గత రెండేళ్లుగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు సహకారం మరువలేనిదని ఆయన తెలిపారు. కాగా పురం మున్సిపల్ కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు.

### హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న గ్రామ పెద్దలు

**లేపాక్షి:** స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం శాశ్వత హుండీలోని కానుకలను లెక్కించారు. 45 రోజులకు రూ. 1,07,970 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### రైతు భరోసా కేంద్రం తనిఖీ

**మడకశిర(అగళి):** అగళి మండలం హెచ్‌డీ హళ్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఏఓ శేఖర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఎరువుల లభ్యతపై రైతుల ద్వారా తెలుసుకున్నారు. ఆర్బీకే ఇన్‌చార్జ్ పనితీరుపై రైతులతో ఆరా తీశారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచు ఆధ్వర్యంలో సీహెచ్‌సీ సభ్యులతో సమావేశమై వ్యవసాయ యంత్ర పరికాలను కొనుగోలు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని ఏఓ కోరారు.

### ఔషధాల ధరలు తగ్గించాలి

**హిందూపురం టౌన్:** ఔషధాల ధరలను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం స్థానిక ఇందిరా పార్కులో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీలో వచ్చే మార్పులు, ఉద్యోగ భద్రత, సావనీర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మందులపై జీఎస్టీ తొలగించాలని, ప్రభుత్వ వ్యాక్సిన్ కంపెనీ వెంటనే తెరవాలని, ప్రజలకు నాణ్యమైన మందులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఆర్‌యూ కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి మునీర్, సభ్యులు పురుషోత్తం, రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకులు సీఎంకు రుణపడి ఉంటాం

**మడకశిర:** వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శుక్రవారం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించడం పట్ల బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం లోకి వచ్చాక వాల్మీకి, బోయలకు రాజకీయంగా ప్రాధాన్యత లభించిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాల్మీకి, బోయలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వాల్మీకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ శుక్రవారం అసెంబ్లీలో తీర్మానం చేయించడం పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మడకశిర, అమరాపురం ఎంపీపీలు కవిత, ఈరన్న, వాల్మీకి, బోయ సంఘం నాయకులు కొంకల్లు శివకుమార్, అంబరీష్, నాగేంద్ర, లింగరాజు, సురంగల శ్రీనివాస్, కౌన్సిలర్ లక్ష్మయ్య, మధు, సత్యనారాయణరెడ్డి, ఆ వర్గానికి చెందిన నియోజకవర్గంలోని సర్పంచులు,ఎంపీటీసీలు తదితరులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అగళి వైస్ ఎంపీపీ గాయిత్రి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, స్థానిక నాయకులు లింగరాజు, హేమంత్‌రాజు,నాగరాజు,నారాయణ ,రమేష్, మంజునాథ్ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

## పాఠశాలలకు సామగ్రి అందజేత

**పరిగి:** మండలంలోని బీచిగానిపల్లి, శీగిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలకు వంగలపల్లి వద్ద ఉన్న హిందూపూర్ సోలార్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వివిధ సామగ్రిని అందించారు. శుక్రవారం జరిగిన ఈకార్యక్రమాల్లో డిప్యూటీ మేనేజర్ చక్రధర్‌రెడ్డి, ఆస్రా ఎన్జీవో ఫౌండేషన్ కోఆర్డినేటర్ సోనూ పాల్గొని, కంప్యూటర్, ప్రింటర్, టేబుల్, నాలుగు కుర్చీలను హెచ్ఎంలకు అందించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు నాగప్రసాద్, శంకరయ్య, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలకు సామగ్రిని అందిస్తున్న దృశ్యం

## సంక్షిప్త సమాచారం

**దివ్యాంగులకు వైద్య పరీక్షలు**

**మడకశిర:** పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గంలోని 5 మండలాల దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్‌తోపాటు ఇతర డాక్టర్లు పరీక్షలు చేశారు. పరీక్షల్లో 51 మంది ఉచిత ఉపకరణాలకు ఎంపికయ్యారు. శిబిరంలో ఐఈడీ జిల్లా కోఆర్డినేటర్ ఆనందబాబు, స్థానిక ఎంపీడీఓ సోనిబాయి, రొళ్ల, మడకశిర ఎంఈఓలు శ్రీధర్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

**ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు**

**గోరంట్ల:** స్థానిక టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో కమ్మవారిపల్లి- గోరంట్ల రోడ్డు పై శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొని శిరగంవాండ్లపల్లికి చెందిన సురేష్, కమ్మవారిపల్లికి నరసింహులు, మురళి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి, సురేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు.

**త్రుటిలో తప్పిన ప్రమాదం**

**మడకశిర:** పట్టణ సమీపంలోని శుక్రవారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ బస్సు, టాటా ఏస్‌లు ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. తుమకూరు నుంచి పావగడకు వెళుతున్న టాటా ఏస్‌లు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద పరస్పరం ఢీకొన్నాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

**డిగ్రీ విద్యార్థినికి అభినందన**

**పెనుకొండ:** పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సుస్మితను ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. ఈమె ఈ నెల 15 నుంచి 21 వరకు బెంగళూరు యూనివర్సిటీలో జాతీయ సమైక్యతా శిబిరంలో వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది.

**ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక**

**అమరాపురం:** వి.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం. కరిబడప్ప తెలిపారు. విద్యార్థులు భూమిక, కిరణ్‌కుమార్, యువరాజులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకూ ఏడాదికి రూ.12,000 ప్రకారం ఉపకార వేతనం అందుతుందన్నారు.

**ఇంటర్ పరీక్షకు ముగ్గురు గైర్హాజర్**

**పరిగి:** కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, హిస్టరీ, జువాలజీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 243 మంది హాజరుకావాల్సి ఉండగా, అందులో 240 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

**పేకాట స్థావరాలపై పోలీసుల దాడి**

**గుడిబండ:** జంబులబండ, సింగేపల్లి గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసి , రూ.49,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్**

**రొద్దం:** మండలంలోని ఆర్.లోచర్లలో కర్ణాటక మద్యం విక్రయిస్తూ పెద్దకోడిపల్లికి చెందిన రౌడీ షీటర్ బోయ సురేష్ శుక్రవారం రాత్రి పట్టుబడ్డాడు. ఎస్ఐ నాగస్వామి మాట్లాడుతూ బోయ సురేష్ ఆర్.లోచెర్లలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు నిల్వ ఉంచి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు.

**విద్యాసామగ్రి పంపిణీ**

**పెనుకొండ:** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి శుక్రవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

**గోరంట్ల:** స్థానిక ఉర్దు పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్యాడ్స్, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈఓ గోపాల్ నాయక్, హెచ్ఎం దివాకర్‌రెడ్డి , పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుల నిరసన**

**హిందూపురం టౌన్:** రాహుల్ గాంధీపై తప్పుడు కేసు బనాయించి శిక్ష విధించడంపై కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో ర్యాలీ చేపట్టి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్, నాగరాజు, అమానుల్లా, యూనస్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.